# నగరాన్ని అభివృద్ధి చేశా.. మళ్లీ ఆశీర్వదించండి

## బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా



బిగాల గణేశ్ గుప్తా దంపతులకు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఖలీల్‌వాడి, నవంబర్ 21 : సీఎం కేసీఆర్ సహకారంతో తొమ్మిదేండ్లలో నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, తనను మరోసారి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా అన్నారు. నగరంలోని 9, 10వ డివిజన్లలో ఆయన సతీమణి లత, సోదరీమణులు వాణి, రాణి, సోదరుడు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాలతో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా డివిజన్లలోని ప్రజలు వారికి ఘనస్వాగతం పలుకుతూ పూలమాలలు వేసి సన్మానించారు. మంగళహారతులతో స్వాగతం పలికి తిలకం దిద్దారు. ప్రముఖ యాంకర్ శివజ్యోతి వారితో పాటు ఇంటింటికీ తిరుగుతూ ఎమ్మెల్యే బిగాలను ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా బిగాల గణేశ్ గుప్తా మాట్లాడుతూ.. నగరంలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టామని తెలిపారు. మినీ ట్యాంక్‌బండ్, ఆర్‌యూబీ నిర్మాణం, ఐటీ హబ్, న్యాక్‌భవన్‌తో పాటు అత్యాధునిక సౌకర్యాలతో వైకుంఠధామాలను నిర్మించామని తెలిపారు. రోడ్ల విస్తరణ, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దానన్నారు. నగర అభివృద్ధి ప్రజల ముంగిట ఉన్నదని, తనను మరోసారి ఆశీర్వదిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. కారు గుర్తుకే ఓటు వేసి భారీ గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేటర్లు సాధు సాయివర్ధన్, బోడిగం కోమల్ నరేశ్, దండు శేఖర్, కర్ణవర్ధన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న బిగాల గణేశ్ గుప్తా

### రోడ్‌షోకు విశేష స్పందన..

నగరంలోని 21, 57, 58వ డివిజన్లలోని లైన్‌గల్లీ, దారుగల్లీ, అహ్మదీ బజార్, బర్కత్‌పుర, ముస్తాయిద్‌పురలో మంగళవారం రాత్రి బిగాల గణేశ్ గుప్తా రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షోలో స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా కాలనీల్లో బిగాలను గజమాలలతో సత్కరించారు. నగరంలో తాను చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోను తప్పకుండా అమలుచేస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్‌కో మాజీ చైర్మన్ ఎస్ఏ అలీం, అబ్దుల్ ఖుద్దూస్, నవీద్ ఇక్బాల్, అమర్, బాల్‌కిషన్, ఇమ్రాన్, షెహజాద్ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సమక్షంలో నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గూడ్స్ యూనియన్ అధ్యక్షుడు మోయిన్‌తోపాటు సభ్యులు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే బిగాల గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

– ఖలీల్‌వాడి, నవంబర్ 21

## గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా..

■ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖలీల్‌వాడి, నవంబర్ 21 : గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ కవితను గంగపుత్ర సంఘం సభ్యులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమె ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమైక్య పాలనలో రూ. 400 కోట్లు కూడా లేని మత్స్య పరిశ్రమను సీఎం కేసీఆర్ నాయకత్వంలో రూ. 30 వేల కోట్లకు పెంచుకున్నామని తెలిపారు. ప్రతి గంగపుత్ర కుటుంబంలో సంతోషం నింపడమే లక్ష్యమని, అందుకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు అల్లుల నారాయణ, బట్టు సాయిరాం, తోపారం గంగాధర్, బాలగంగాధర్, రమేశ్‌తోపాటు గంగపుత్ర సంఘానికి చెందిన వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## 24 నుంచి పవిత్రోత్సవాలు

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 21 : నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న రామాలయం నిర్మించి 37 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు సీతారామచంద్ర స్వామి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు మేనేజింగ్ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 24న విష్ణు సహస్రనామ పారాయణం, అంకురార్పణ, 25న పవిత్రారోపణ మూలమంత్ర జపం, 26న సుదర్శన శతక హవనం, 27న మహా పూర్ణాహుతి, 81 కలశాలతో అభిషేకం, సీతారాముల కల్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని కమిటీ ప్రతినిధులు వివరించారు. త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి, దేవనాథ జీయర్ స్వామి పర్యవేక్షణలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## అంతర్రాష్ట్ర పోటీల్లో 'నిర్మల హృదయ' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఖలీల్‌వాడి, నవంబర్ 21 : కాటకిష్ట సిస్టర్స్ సెయింట్ ఆన్స్, సెయింట్ జోసెఫ్ ప్రావిన్స్ – అల్వాల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర 18వ టోర్నమెంట్‌ను ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు కరీంనగర్ సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి 22 పాఠశాలలకు చెందిన 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ క్రీడాపోటీలు నిర్వహించగా.. నిజామాబాద్ నగరానికి చెందిన నిర్మల హృదయ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాల కరస్పాండెంట్ రెవరెన్సీ సిస్టర్ నిర్మల, ప్రధానోపాధ్యాయిని సరితా సింగారెడ్డి ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం అభినందించారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న 180 మంది ఎన్నికల సిబ్బంది

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 21 : రూరల్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 180 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా మంగళవారం తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాజేంద్రకుమార్ తెలిపారు. పోలింగ్ నిర్వహణ విధులపై అవగాహన కల్పించేందుకు జిల్లా పరిధిలోని నిజామాబాద్‌అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, బోధన్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలకు ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించిన రూరల్ సెగ్మెంట్ సిబ్బందికి మంగళవారం రెండో విడుత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ల సహాయంతో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి తెలిపారు. బుధవారం సైతం శిక్షణ తరగతులు కొనసాగుతాయని, ఎన్నికల విధుల్లో నిర్వర్తించే వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

## 25 నుంచి ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 21 :నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 25 నుంచి 27 వరకు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్–నిజామాబాద్ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ ధార్మికవేత్త దయానంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరానికి చెందిన తటవర్తి వీర రాఘవరావు ధ్యానం, శాకాహారం తదితర అంశాలపై వివరిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం ఉంటుందని, మరిన్ని వివరాల కోసం 6704547615 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## నేడు గణపతి హోమం

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 21 : నగరంలోని రైల్వే గేట్ సార్వజనిక్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో నేడు (బుధవారం) ఉదయం 9 గంటలకు గణపతి యజ్ఞం, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బంటు గణేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక శుద్ధ దశమి, బుధవారం పురస్కరించుకొని ధార్మిక కార్యక్రమాలతోపాటు సాయంత్రం 6.30 గంటలకు అన్నపూజ, అన్నదానం ఉంటుందని, భక్తులు హాజరుకావాలని కోరారు.

# సీఎం కేసీఆర్ వెంటే మేమంతా..

## బ్రాహ్మణ సంఘం సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

ఖలీల్‌వాడి, నవంబర్ 21 : సీఎం కేసీఆర్ వెంటే బ్రాహ్మణులంతా ఉంటున్నామని బ్రాహ్మణుల సంఘం జిల్లా ప్రతినిధి మధుసూదన్ శర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణుల సేవా సంఘ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బ్రాహ్మణులకు సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో బ్రాహ్మణులను బీజేపీ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నదని తెలిపారు. బెస్ట్ పథకం కింద బ్రాహ్మణ పరిషత్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ధూపదీప నైవేద్యం వంటి పథకాలు ఎక్కడా లేవన్నారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం తెలంగా ప్రభుత్వం కృషిచేస్తున్నదన్నారు. జిల్లాలో 751 ఆలయాలు ఉండగా.. 2014 నుంచి ఇప్పటివరకు రూ. 45.96 కోట్లు మంజూరు చేసి, నూతన ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ కోసం ఖర్చుచేసినట్లు వెల్లడించారు. ధూపదీప నైవైద్యం ద్వారా 375 మందికి రూ. 10వేల లబ్ధి చేకూరుతున్నదని చెప్పారు. బ్రాహ్మణులు బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు కిరణ్, సురేశ్, సంజీవ్ శర్మ, అరవింద్ శర్మ, రమేశ్, వేణు, లక్ష్మీనారాయణ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.

NT-314452

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.